I

సాక్షి సిద్దిపేట

గురువారం । 9 । మే । 2024



నర్సాపూర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, వెంకట్రామిరెడ్డి



కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

మల్లన్న జలాలతో సిరులే..

- సస్యశ్యామలం చేయడమే నా కల
- అందుకు ప్రభుత్వంపై యుద్ధం చేద్దాం
- నర్సాపూర్ కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

నర్సాపూర్/నర్సాపూర్‌రూరల్: మల్లన్నసాగర్ కాలువల ద్వారా సాగు నీరు వస్తే నర్సాపూర్ బంగారు తునక అవుతుందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. బస్సుయాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నర్సాపూర్‌ను లింకు చేయడానికి శంకరంపేట నుంచి కాలువల తవ్వకాలు కొనసాగుతున్నాయని చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి ఒక్కసారి నీరు రావడం మొదలైతే నర్సాపూర్ సస్యశ్యామలం అవుతుందన్నారు. కాలువల నిర్మాణం పూర్తయి నీళ్లు రావాలంటే మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డి గెలవాలన్నారు. మనమంతా కలిసి యుద్ధం చేస్తేనే ఈ ప్రభుత్వం నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యేగా సునీతారెడ్డి గెలిచినప్పటి నుంచి కాలువల నిర్మాణంలో స్పీడ్ పెంచే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. నర్సాపూర్ పొలాలు గోదావరి జలాలతో పారాలన్నదే నా కల అన్నారు. నర్సాపూర్‌ను ఎంతో అభివృద్ధి చేశామని, మున్సిపాలిటీకి రూ. 25 కోట్ల నిధులు ఇచ్చామని, గ్రామ పంచాయతీల అభివృద్ధికి సైతం నిధులు ఇవ్వగా ఈ ప్రభుత్వం ఆ నిధులన్నింటినీ వెనక్కి తీసుకుపోయిందని ఆరోపించారు. కొల్చారంలో మల్లినాథసూరి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని తాను నిర్ణయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. తమ హయాంలో హల్దీ వాగు, మంజీరాపై 10 చెక్ డ్యాంలు నిర్మించామని, రైతులు బ్రహ్మాండంగా పంటలు పండించారని చెప్పారు.

తండాలను పంచాయతీలు చేశాం..

దశాబ్దాల పాటు పరిపాలించిన ఏ ప్రభుత్వం తండాలను పట్టించుకోలేదని, తాము తండాలను పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేశామని కేసీఆర్ అన్నారు. మన రిజర్వేషన్లు మనకు ఉండాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి గెలవాలని పిలుపునిచ్చారు. కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్‌హుస్సేన్, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, కార్మిక బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జెడ్పీటీసీ బబియానాయక్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, చంద్రాగౌడ్, గోపి, వెంకట్‌రెడ్డి, నయిమోద్దీన్, సత్యంగౌడ్, పంబాల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరుకు రైల్వే కోచ్ సాధిస్తాం

పటాన్‌చెరు: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే పటాన్‌చెరుకు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధిస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ నియోజకవర్గంలో పదేళ్ల కిందట రెండు లక్షల ఓటర్లు ఉండేవారని, ఇప్పుడు నాలుగు లక్షలకు చేరిందన్నారు. తమ ఇండస్ట్రియల్ పాలసీ కారణంగా పటాన్‌చెరులో అనేక పరిశ్రమలు వచ్చాయని గుర్తు చేశారు. పారిశ్రామిక అవసరాలకు నిరంతరం విద్యుత్తును సరఫరా చేశామని గుర్తు చేశారు. దీంతో దేశంలోని నలు మూలల నుంచి పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు రావడంతో వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు, ఉద్యోగులు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారని కేసీఆర్ వివరించారు. కాలుష్య ప్రాంతంగా ఉన్న పటాన్‌చెరులో స్వచ్ఛమైన మంచినీటి మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి మంచినీరు సరఫరా చేశామని తెలిపారు.



పటాన్‌చెరులో జరిగిన రోడ్‌షోకు హాజరైన జనం

కేసీఆర్‌కు నీరాజనం

గజ్వేల్‌లో ఘన స్వాగతం



గజ్వేల్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గజ్వేల్‌లో ఘన స్వాగతం లభించింది. నర్సాపూర్ ఎన్నికల ప్రచారసభకు వెళ్లే క్రమంలో బుధవారం సాయంత్రం పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా బస్సులో నుంచే కార్యకర్తలు, నాయకులు అభివాదం చేశారు. అప్పటికే గంటకుపైగా వేచి చూస్తున్న ప్రజలు కేసీఆర్ రావడంతో ఒక్కసారిగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బస్సులోకి వెళ్లి కొద్దిసేపు మాట్లాడి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార సరళిని కేసీఆర్ ప్రతాప్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ శిరీష మంగళ హారతులతో స్వాగతం పలికారు. అదేవిధంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ రజిత, మరికొంత మంది మహిళలు కేసీఆర్‌ను కలిశారు. అంతకుముందు మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం చౌరస్తాలో కొద్దిసేపు ఆగి అభివాదం చేసి వెళ్లారు.

చేనేత పరిశ్రమను నాశనం చేసింది బీఆర్ఎస్సే

- రూ.100 కోట్ల సబ్సిడీ సైతం ఇవ్వలేదు
- మంత్రి కొండా సురేఖ

దుబ్బాక: చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం దుబ్బాక చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. నేతన్నల కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేతన్నలకు ఇవ్వాల్సిన రూ.100 కోట్ల సబ్సిడీని ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం దగాకు గురి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి చేనేత కార్మికులను ఆదుకుంటామన్నారు.

వచ్చేది 'ఇండియా' కూటమే..

కేంద్రంలో అధికారంలోకి వచ్చేది 'ఇండియా' కూటమేనని మంత్రి కొండా సురేఖ అన్నారు. బీజేపీ ఎన్ని అసత్యపు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. కుటుంబ పాలనతో తెలంగాణను లూటీ చేసిన బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పినట్లుగానే బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మద్దుల గాల్‌రెడ్డి ఉన్నారు.



దుబ్బాకలో నేతన్నలతో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

అవ్వా.. నేను చేనేత బిడ్డనే..

దుబ్బాక: బాగున్నావా అవ్వా.. నేను మీ చేనేత బిడ్డనే.. అంటూ రాట్నం చుడుతున్న 80 ఏళ్ల వృద్ధ కార్మికురాలిని మంత్రి కొండా సురేఖ ఆప్యాయంగా పలకరించారు. 'మీ కష్టాలు స్వయంగా తెలుసు. ఇప్పుడు మంత్రిని అయ్యా.. మీ కష్టాలు తీరుస్తా' అంటూ మనోధైర్యం ఇచ్చారు. నీ ఓటు కాంగ్రెస్‌కు వేయాలని మంత్రి కోరారు.

రైతుల ఉసురు తీసింద్రు

తొగుట(దుబ్బాక): గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్న సాగర్ నిర్వాసితుల ఉసురు తీసిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా బుధవారం తొగుటలో కార్నర్ మీటింట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల నుంచి భూములు బలవంతంగా లాక్కున్నారని ఆరోపించారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా గత ప్రభుత్వం మోసంచేసిందని ఆరోపించారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు

- బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు సందర్భంగా కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. పాల్గొన్న మంత్రి పొన్నం మాట్లాడుతూ అన్ని కులాలను కలుపుకొని పోవాలని, అందరి సహకారం ఉంటేనే రాజకీయ నాయకుడిగా ఎదుగుతారని తెలిపారు. రెడ్డి కమ్యూనిటీ భవనం కోసం రూ.50లక్షలు కేటాయించిన ప్రొసిడింగ్‌ను అందజేశారు. ఎన్నికల తర్వాత మరో రూ.50లక్షలు కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగు కాలాల పాటు సమాజానికి సేవ చేయడానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మేము అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చామని తెలిపారు. త్వరలోనే వరి కి రూ.500 బోనస్, రూ.2లక్షల రుణ మాఫీ, కొత్త పెన్షన్లు, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇస్తామన్నారు. సమావేశంలో రెడ్డి సంఘం నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, మడప జైపాల్ రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు

హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి ఆలయంలో, హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్‌లో రెడ్డి సంఘం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మంత్రి పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఆరపల్లె మోహన్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న నీలం మధు

ఒక్క అవకాశం ఇవ్వండి

- కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

దుబ్బాకటౌన్: బీసీ బిడ్డనైనా తనకు మెదక్ ప్రజలు ఎంపీగా ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. బుధవారం రాత్రి దుబ్బాకలో తెలంగాణ తల్లి చౌరస్తాలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు చేసిందేమీలేదని ఆరోపించారు. దేశంలో ప్రయివేటీకరణ ప్రోత్సహిస్తున్న బీజేపీ తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఎంపీగా గెలువగానే నియోజకవర్గ నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించి యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తానని హామీనిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 5 గ్యారంటీలను అమలు చేసిందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి మెదక్ ఎంపీగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, పంట నష్టంపై సర్వే చేయించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా హుస్నాబాద్ పట్టణంలో చాడ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, కేసీఆర్ మాటలు నమ్మొద్దు

- గెలిపిస్తే అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా
- మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

వర్గల్(గజ్వేల్): 'హామీలు అమలుచేయని సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ అసత్యపు మాటలు నమ్మొద్దు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే ఇక్కడి భూములన్నీ లాక్కుని, రాజ్ పుష్ప బోర్డులు పెడతారు'అని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. బుధవారం వర్గల్‌లో సీనియర్ నాయకులు రాంరెడ్డి, నందన్‌గౌడ్, బాల్‌రెడ్డిలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ సీఎం రేవంత్ ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ డబుల్‌బెడ్రూం ఇళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఎమ్మెల్సీ పదవి దక్కించుకుని ఏనాడు కన్పించని వెంకట్రామిరెడ్డికి, మళ్లీ ఎంపీ పదవెందుకని నిలదీశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.



వర్గల్‌లో ప్రసంగిస్తున్న రఘునందన్‌రావు

గెలిపిస్తే పార్లమెంట్‌లో గళం వినిపిస్తా

ములుగు(గజ్వేల్): ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో గళం వినిపిస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం రాత్రి ములుగు మండలంలో రోడ్ షో నిర్వహించి ప్రసంగించారు.

చివరి శ్వాస వరకు మీ కోసమే పనిచేస్తా

- మీరు మరింత అండగా ఉండాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: 'నా చివరి శ్వాస వరకు మీ కోసమే పనిచేస్తా. సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు మీరు మరింత అండగా ఉండాల'ని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం తారస్థాయిలో ఉండేదని, ఇప్పుడు కుదేలు అయ్యిందని విమర్శించారు. సిద్దిపేట అంటే గౌరవం ఉందని, దాన్ని కాపాడే బాధ్యత మీదేనన్నారు. వెంకట్రామిరెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.



హరీశ్‌రావును సన్మానించిన నాయకులు

కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేస్తే మన పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలని, మీరే ప్రచార సారథులని అన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సుప్రీంకోర్టు మాజీ జడ్జిని కలిసిన కలెక్టర్



సుప్రీంకోర్టు మాజీ జడ్జి చంద్రఘోష్‌కు మొక్క అందిస్తున్న కలెక్టర్

కొండపాక (గజ్వేల్): దుద్దెడ శివారులో నాగుల బండ వద్ద సుప్రీంకోర్టు మాజీ జడ్జి, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ కమిషన్ చైర్మన్ పినాక చంద్రఘోష్‌ను బుధవారం కలెక్టర్ మనుచౌదరి మర్యాద పూర్వకంగా కలిశారు. రామగుండం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఓ హోటల్‌లో తేనీటి విందు స్వీకరించే క్రమంలో కొద్దిసేపు ఆగి విశ్రాంతి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ కలిశారు. కలెక్టర్ వెంట పోలీస్ అదనపు డీసీపీ (అడ్మిన్) మల్లారెడ్డి, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ హరిరాం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన సీపీ



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సాయిరమాదేవిని పోలీసు కమిషనర్ అనురాధ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో అదనపు డీసీపీ మల్లారెడ్డి ఉన్నారు.

మల్బరీ తోటల పరిశీలన



తోటను పరిశీలిస్తున్న ఏడీఏ ఇంద్రసేనారెడ్డి

నంగునూరు(సిద్దిపేట): ముండ్రాయిలో వర్షానికి దెబ్బతిన్న మల్బరీ తోటలను బుధవారం పట్టు పరిశ్రమ శాఖ అధికారులు పరిశీలించారు. రైతు రాగుల రాజు రెండెకరాల మల్బరీ సాగు చేయగా అకాల వర్షానికి పూర్తిగా ధ్వంసమైంది. అలాగే ఈదురు గాలులతో కూడిన వర్షానికి పురుగులు చనిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఏడీఏ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ నష్టం వివరాలను ఉన్నతాధికారులకు అందజేసి రైతుకు పరిహారం అందేలా చూస్తామన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



రైతులకు శిక్షణ ఇస్తున్న హార్టికల్చర్ అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఆయిల్ ఫెడ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెప్యాలలో ఆయిల్‌పామ్ సాగుపై హార్టికల్చర్ అధికారులు బుధవారం రైతులకు క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ సాగుపై అవగాహన పెంచుకోవాలని చూచించారు. కార్యక్రమంలో డీఏ శంకర్, హార్టికల్చర్ ఏఈఓ అనిల్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక, ఆయిల్‌ఫెడ్ డీసీఓ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

'బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందించే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆపదలో, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటంలో ధైర్యసాహసాలు చూపినవారు, సాంస్కృతిక కళలు, క్రీడలు, సమాజసేవ, పాండిత్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు అర్హులని తెలిపారు. వారి వివరాలను ఉపాధ్యాయులు, బాలలు, సంస్థలు అన్ని పత్రాలతో ఆన్‌లైన్‌లో జూలై 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ పురస్కరించుకుని అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ http://awards.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

నర్సాపూర్: కార్మిక వ్యతిరేక మతోన్మాద బీజేపీ పార్లమెంటు ఎన్నికలలో ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ కోరారు. బుధవారం ఓ ప్రైవేటు కాలేజీలో సీఐటీయూ ఆధ్వర్యంలో పార్లమెంటు ఎన్నికలు–కార్మికుల కర్తవ్యం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం, వారి హక్కులపై దాడి పెరిగిందని, పోరాడి సాధించిన 44 కేంద్ర కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సుకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, దాసు, నాగభూషణం, సురేశ్, పాల్గొన్నారు. సదస్సు అనంతరం పట్టణంలో నీలం మధుకు మద్దతుగా సీఐటీయూ, సీపీఎం నాయకులు ప్రచారం చేపట్టారు.

రక్తంతో మంత్రి పొన్నం చిత్రపటం



మంత్రి పొన్నంకు చిత్రపటం అందజేస్తున్న సాయికృష్ణ

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పుట్టిన రోజు పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ నాయకుడు గట్టు సాయికృష్ణ గౌడ్ తన రక్తంతో చిత్ర పటం వేయించి బుధవారం బహూకరించాడు. 10 మిల్లీ లీటర్ల రక్తంతో చిత్ర పటానికి పెయింట్ వేయించి మంత్రి క్యాంపు కార్యాలయంలో అందించడంతో అందరూ అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్కు శ్రీనివాస్, వరప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ వలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

రూ.3.99 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైమ్ జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు డబ్బులు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నందన్ రతన్ ఫ్రైడ్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఏప్రిల్ 8వ తేదీన పార్ట్ టైమ్ జాబ్ అంటూ వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేయడంతో సైట్ నిర్వాహకులు అతడికి ఒక వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ. 3 లక్షల 99 వేలు చెల్లించాడు. ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా సైబర్ నేరగాళ్లు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గులాబీ జోష్



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న కేసీఆర్



నర్సాపూర్‌లో కేసీఆర్ ప్రసంగం వింటున్న ప్రజలు



నర్సాపూర్‌లో బ్యాండ్ మేళాలతో కేసీఆర్‌కు స్వాగతం



విజిల్ వేస్తున్న యువకుడు



పటాన్‌చెరులో కేసీఆర్‌ను సెల్‌ఫోన్‌లో బందిస్తున్న ప్రజలు



జనాలకు అభివాదం చేస్తున్న హరీశ్‌రావు



పటాన్‌చెరులో కేసీఆర్, హరీశ్‌రావు ప్లకార్డులతో అభిమానులు

- ఫోటోలు: నర్సాపూర్/స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ఓటరు మదిలో ఏముందో?

- అర్థం కాక తలలు పట్టుకుంటున్న నాయకులు
- నుక్కా, ముక్కా లేకపాయే..
- చేతులో జెండా.. ఆలోచనేమో పక్కకు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడడంతో ఓటర్ల నాడీ తెలియక రాజకీయ పార్టీల నేతలు తలలు పట్టుకుంటున్నారు. నమ్ముకున్న కార్యకర్తలే తమ పార్టీని కాదని మరొకరికి ఓటు వేస్తారన్న ఆలోచనలో కొంత మంది నాయకులు ఉన్నారు. పార్టీల కార్యకర్తలు ఒక దగ్గరికి చేరారంటే జెండాలను పక్కనపెట్టి అభ్యర్థుల గెలుపు, ఓటములపైనే చర్చించుకుంటున్నారు. బడా నేతలు సైతం ఎప్పటికప్పుడూ క్షేత్రస్థాయిలో ఓటర్ల నాడీ పట్టుకునే ప్రయత్నంలో బిజీబిజీగా ఉంటున్నారు. కానీ వారికి ఓటర్ నాడీ దొరక్క ఒక తాటి మీదకి రాలేని పరిస్థితి నెలకొంది.

గత ఎన్నికలకు భిన్నంగా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఒక వైపే ఉన్నప్పటికీ ఈ ఎన్నికల్లో మాత్రం ఎటువైపు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. పైకి తాము ఈ పార్టీకే ఓటు వేస్తామని చెబుతున్నా లోపల మాత్రం మరొకటి ఉంటుందని స్థానికంగా చర్చించుకుటుంన్నారు. గత ఎన్నికల మాదిరిగా ఈ ఎన్నికలకు సందడి కనిపించడంలేదు. గత ఎన్నికల్లో ఆది నుంచే మద్యం, డబ్బుల హవా నడిచేది. రాత్రి అయిందంటే ఎక్కడికి వెళ్లిన బిర్యానీ, మందు దావతులే కనిపించేవి. ప్రస్తుతం అవేమీ ఇక్కడ కనిపించడం లేదు. చాలా మటుకు ఈ ఎన్నికల్లో కార్యకర్తలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారని పలు పార్టీల నేతలు చెప్పుకొస్తున్నారు. పై నుంచి రానిది తాము ఎక్కడి నుంచి తేవాలి అందుకే అందరం అభ్యర్థి కోసం స్వచ్ఛందంగా పని చేస్తున్నామని పలువురు నాయకులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఎన్నికల్లో ఓటర్ నాడీని మాత్రం ఎవరూ పట్టుకోలేకపోతున్నారు.

నీలంను భారీ మెజార్టీతో గెలిపించాలి

మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

నిజాంపేట(మెదక్): కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నా రు. బుధవారం నిజాంపేట మండల కేంద్రంలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో మండలానికి చెందిన సుమారు 500 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట మండలం పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించడానికి కమిటీ వేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధ రాములు, పార్టీ మండల అధ్యక్షుడు మారుతీ, ముత్యంరెడ్డి, లింగంగౌడ్, అమరసేనారెడ్డి, నసీరొద్దీన్, మహేందర్, వెంకటేశ్, లస్మాగౌడ్, క్రాంతి కిరణ్, రాహుల్ రెడ్డి, నర్సింహారెడ్డి, అజయ్, పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎమ్మార్పీస్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు

పాపన్నపేట(మెదక్): పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు అవుతుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం రాత్రి పాపన్నపేట కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 4 నెలల్లో 5 గ్యారంటీలు అమలు చేసిందన్నారు.

లేగ దూడపై హైనా దాడి



గాయపడిన లేగదూడ

మద్దూరు(హుస్నాబాద్): లేగ దూడపై హైనా దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని కూటిగల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జ్ఞానమైన శ్రీనివాస్ అనే రైతు వ్యవసాయ బావి వద్ద లేగ దూడని కట్టేశాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి హైనా దాడిలో తీవ్రంగా గాయపడి ఉంది. ఇటీవల కాలంలో మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లోని గ్రామాల్లో హైనాలు సంచరిస్తూ మూగ జీవాలపై దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్యారంటీల అమలును మరిచారు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలును మర్చిన కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో ఓడించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని వీరన్నపేట, ముస్త్యాల, రాంపూర్, ఆకునూర్, దొమ్మాట, గుర్జకుంట గ్రామాల్లో బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్‌కి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. ఆరు గ్యారంటీల అమలు విషయంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందన్నారు. చేర్యాల, జనగామ ప్రాంత సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పినట్లుగానే పార్లమెంట్‌లో ఈ ప్రాంత సమస్యలపై మాట్లాడాలంటే మల్లేష్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు, నాయకులు ముస్త్యాల బాల్ నర్సయ్య, అంకుగారి శ్రీధర్ రెడ్డి, ఎలికట్టె శివ శంకర్, పెడతల ఎల్లారెడ్డి, గదరాజు చందు, వల్లూరి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్‌ను పట్టాలు దాటిస్తుండగా..

రైలు ఢీకొని యువకుడి మృతి



దెబ్బతిన్న బైక్

రామాయంపేట(మెదక్): బైక్‌ను పట్టాలు దాటిస్తుండగా రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అక్కన్నపేట బీసీ కాలనీ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే పోలీసుల కథనం మేరకు.. బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు గేటు ద్వారా కాకుండా గ్రామ శివారులోని బీసీ కాలనీ వద్ద బైక్‌ను పట్టాలు దాటిస్తున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ వైపు అతి వేగంగా వెళ్తున్న ఓకా రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు పారిపోయాడు. మృతి చెందిన యువకుని కాళ్లు, చేతులు తెగిపోయి పట్టాలపై పడిపోయాయి. చెవిలో ఎయిర్ ఫోన్స్ పెట్టుకోవడంతో రైలు వస్తున్న శబ్దం వినిపించక ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహం వద్ద పాన్‌కార్డు లభించగా ప్రకాశ్ అనే పేరు ఉంది. ఈ ప్రమాదంతో అరగంటకు పైగా ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావూనాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమలో కార్మికుడు మృతి



సత్యనారాయణ (ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన హత్నూర మండలంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం మేరకు.. హత్నూర మండలం మంగాపూర్ గ్రామానికి చెందిన నకచుంచు సత్యనారాయణ(42) కొన్నేళ్లుగా నస్తీపూర్ గ్రామ శివారులోని లోటస్ చాక్లెట్ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం జనరల్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యాడు. పని చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా సత్యనారాయణ కుప్పకూలిపోయాడు. వెంటనే సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పరిశ్రమ వద్దకు చేరుకొని మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ సుభాష్ ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పినా వినలేదు. చివరగా పరిశ్రమ యాజమాన్యం మృతుడి కుటుంబానికి రూ.8 లక్షలతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

ప్రతీ క్షణం నిఘా

- ప్రశాంత ఎన్నికలకు పోలీసుల చర్యలు
- 2,098 పోలింగ్ కేంద్రాల్లో 381 సీసీ కెమెరాలు



మెదక్ కలెక్టరేట్: మెదక్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్నికల సంఘం పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అని చర్యలు చేపడుతోంది. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటన జరిగినా క్షణాల్లో తెలిసేలా పోలింగ్ పోలింగ్ కేంద్రాల వద్ద నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తుంది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మెదక్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఉన్నాయి. ఇందులో 18,28,210 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 2,098 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే మరో 26 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఆలోచనలో అధికారులు ఉన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 381 పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతీ క్షణం పరిశీలించనున్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు కెమెరాలను బిగించి ఎప్పటికప్పుడూ అధికార యంత్రాంగం పర్యవేక్షించే ఏర్పాట్లు చేస్తుంది. అలాగే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 349 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైన కేంద్రాలు, 1770 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి చర్యలు చేపడుతున్నారు. ఒక్కో ప్రాంతంలో 2 నుంచి 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సీసీ కెమెరాల ఏర్పాటు సంఖ్యను తగ్గించనున్నారు.

ప్రత్యక్షంగా వీక్షణం

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను ఎప్పటికప్పుడూ వీక్షించేలా సహాయ ఎన్నికల అధికారి కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. సాధారణ, పోలీసు పరిశీలకులతో సహా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు కంట్రోల్‌రూంలో అందుబాటులో ఉండి పోలింగ్ తీరును ప్రత్యక్షంగా వీక్షిస్తారు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమయ్యేలా, ఘర్షణలకు తావులేకుండా పోలీసు బలగాలను రంగంలోకి దించేలా నిఘా కెమెరాల వ్యవస్థ పనిచేస్తుంది.

పొలిటికల్ హీట్

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ

పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్



మాట్లాడుతున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని ఆయన నివాసంలో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్ సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఖేడ్ పట్టణానికి చెందిన దర్గా మజీద్ కమిటీ అధ్యక్షుడు హాశం అలీ, నాయకులు లతీఫ్ సేట్, సలీం, అమేర్‌లతోపాటు వెంకటాపూర్, రాంతీర్థ్, నాగూరు(బి), పుల్‌కుర్తి, తడ్కల్ గ్రామాలకు చెందిన దాదాపు 150 మంది చేరిన వారిలో ఉన్నారు.

జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేశ్ శెట్కార్ అన్నారు. బుధవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సురేశ్ శెట్కార్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద పీట వేయనుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎ.చంద్రశేఖర్, ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డీ తన్వీర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం మాతోనే సాధ్యం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. నిజాంపేట మండల కేంద్రంలో బుధవారం పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శశికళ యాదవరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్, ఎంపీటీసీ సబితా లింగారెడ్డి, రాధాకిషన్, శంకర్, పార్టీ మండ ల అధ్యక్షుడు తాహేర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్ పాల్గొన్నారు. నిరుపేద కూలీలకు ఉపాధి కోసం కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి చట్టం చేసిందని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు వినోద్‌పాటిల్ తెలిపారు.

కల్హేర్(నారాయణఖేడ్): ఎమ్మెల్యే డాక్టర్ పీ.సంజీవరెడ్డి బుధవారం సిర్గాపూర్, వాసర్, బీబీపేట, మార్డిలో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేశ్ షెట్కార్, అసెంబ్లీ ఇన్‌చార్జి శశికళ మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య, మనీశ్ పాటిల్, మాజీ ఆత్మ చైర్మన్ గుండు నరేందర్, నాయకులు దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి



ప్రచారం చేస్తున్న సునీతా రెడ్డి

నర్సాపూర్ రూరల్: కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ మండలంలోని పెద్ద చింతకుంట, చిన్నచింతకుంట గ్రామాలతోపాటు గిరిజన తండాల్లో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాగు, తాగు నీటితో పాటు అనేక పథకాలు ప్రవేశపెట్టి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. వెంకట్రామిరెడ్డిని గెలిపించి కేసీఆర్‌కు గిఫ్టు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాబియా నాయక్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగరావు, చిన్న చింతకుంట మాజీ సర్పంచ్ సురేశ్ గౌడ్, పెద్ద చింతకుంట మాజీ సర్పంచ్ శివ కుమార్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదు

కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి మధు



మాట్లాడుతున్న నీలం మధు

రాయపోలు(దుబ్బాక): పదేళ్ల బీజేపీ పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు దేశాన్ని దోచిపెట్టారని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు విమర్శించారు. బుధవారం రాయపోలు, దౌల్తాబాద్ మండల కేంద్రాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఇక మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేసి పేదలకు తీరని అన్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పాల్గొని ప్రసంగించారు. వారితోపాటు దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానే

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: బీజేపీ, కాంగ్రెస్‌లు ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు తెరతీస్తున్నా మెదక్ పార్లమెంట్‌లో ఎగిరేది గులాబి జెండానేనని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక నియోజకవర్గంలోని పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలనపై పట్టు ఉన్న మంచి మనిషి బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఏంటో దుబ్బాక ప్రజలకు అంతా తెలుసు అని.. అన్నారు. రఘునందన్‌రావును మరోసారి దుబ్బాక ప్రజలు చిత్తుగా ఓడించాలన్నారు.